అంబరాన్నంటిన దసరా సంబురాలు


గూడూరు: దహనమవుతున్న రావణ ప్రతిమ


గూడూరులో దసరా వేడుకలకు హాజరైన ప్రజలు


కేసముద్రం: జ్యోతిరావు పూలే సెంటర్‌లో..

జిల్లా వ్యాప్తంగా గురువారం విజయదశమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానికంగా ఉన్న బొడ్రాయిల వద్ద సోరకాయలను నరికి వేడుకలు చేశారు. ప్రజలు భక్తిశ్రద్ధలతో జమ్మి చెట్టుకు శమి పూజలు నిర్వహించారు. పోలీస్‌స్టేషన్‌లలో ఆయుధపూజ చేశారు. చెడుపై మంచికి చిహ్నంగా రావణాసుర ప్రతిమను దహనం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్


మరిపెడలో: జమ్మిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్, తదితరులు


తొర్రూరు: రావణ ప్రతిమకు నిప్పు పెడుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి


కేసముద్రం: పొట్టి శ్రీరాములు సెంటర్‌లో..


గార్ల పోలీస్‌స్టేషన్‌లో ఆయుధ పూజ


కురవి: సోరకాయను నరుకుతున్న ముదిరాజ్ సంఘం నాయకుడు


డోర్నకల్: వేంకటేశ్వరాలయంలో శమీ పూజ..


నెల్లికుదురులో ఏర్పాటు చేసిన రావణ ప్రతిమ

క్లుప్తంగా

108లో ప్రసవం

నెహ్రూసెంటర్: కేసముద్రం మండలం నర్సిములగూడెం గ్రామానికి చెందిన మహేశ్వరీ పురిటినొప్పులతో బాధపడుతుండగా బంధువులు శుక్రవారం 108కు ఫోన్ చేశారు. అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువస్తుండగా మార్గమధ్యంలో పురిటినొప్పులు ఎక్కువ కావడంతో అంబులెన్స్‌లోనే సిబ్బంది, ఈఎంటీ నవీన్ పురుడు పోశారు. వెంటనే తల్లిబిడ్డలను వైద్య చికిత్సల నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. కుటుంబ సభ్యులు ఈఎంటీ నవీన్, పైలట్ సతీష్‌ను అభినందించారు.

డోర్నకల్‌లో..



డోర్నకల్: స్థానిక పాతడోర్నకల్‌కు చెందిన గర్భిణి 108లో ప్రసవించింది. పాతడోర్నకల్‌కు చెందిన షేక్ ఆశ పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు అంబులెన్స్‌కి సమాచారం అందించారు. వాహనంలో ఖమ్మం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పాన్నెకల్లు సమీపంలో వాహనంలోనే ప్రసవించింది. ఈఎంటీ షమీనా అప్రమత్తంగా చికిత్స అందించడంతో ఆశ ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నారని వాహన పైలట్ సైదులు తెలిపారు.

లాల్‌బహదూర్ జయంతి

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని నేతాజీ సేవా సమితి ఆధ్వర్యంలో లాల్ బహదూర్ శాస్త్రీ జయంతి వేడుకలను పురస్కరించుకొని నాయకులు లాల్‌బహదూర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నేతాజీ సేవా సమితి వ్యవస్థాపకుడు కందుల నాగరాజు, ప్రధాన కార్యదర్శి కుదురుపాక వివేక్, ఆరనైజింగ్ సెక్రటరీ బోనగిరి లక్ష్మినారాయణ, కన్వీనర్ శ్రీనివాస్, మంగమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు అంబేద్కర్

డోర్నకల్: ఆదర్శప్రాయుడైన బీఆర్ అంబేద్కర్ సేవలు ఆచరణీయమని బుద్దిస్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు చిలకబత్తిని మాణిక్యరాజ్ తెలిపారు. అంబేద్కర్ దసరా పండుగ రోజున నాగ్‌పూర్‌లో ఐదు లక్షలమందితో బౌద్ధ దీక్ష స్వీకరించిన సందర్భాన్ని పురస్కరించుకుని స్థానిక సుభాష్‌వీధిలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో బాబా సాహెబ్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జర్పుల శరత్‌బాబు, జర్పుల రాము, పగిడిపల్లి వీరరాజు, చంద్రమోహన్, నందా పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం

పెద్దవంగర: మండలంలోని పోచారం గ్రామానికి చెందిన పోగు భాస్కర్ యమున దంపతుల కుమార్తె ప్రణిత నీట్‌లో 2,798 ర్యాంక్ సాధించి మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు పొందింది. ఈ ఘనత సాధించినందుకుగాను పద్మశాలీ(పోపా) ప్రతినిధులు శుక్రవారం ఆమెను ఘనంగా సన్మానించారు.

కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి

ఖానాపురం: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పెద్ది సుదర్శన్‌రెడ్డి కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండలంలోని ఐనపల్లికి చెందిన బీజేపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ గుగులోతు లక్ష్మణ్‌నాయక్‌తోపాటు కొత్తూరుకు చెందిన పలువురు బీఆర్ఎస్‌లో చేరగా వారికి సుదర్శన్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్ గౌడ్, నాయకులు శ్రీనివాస్, బాలకిషన్, బాలునాయక్ పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

తొర్రూరు రూరల్: డివిజన్ కేంద్రం నుంచి మాటేడు మీదిగా బొడ్లాడ గ్రామానికి వెళ్లే రోడ్డును లయన్స్ క్లబ్ తొర్రూరు వారి ఆధ్వర్యంలో శుక్రవారం మరమ్మతులు చేశారు. ప్రధానంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ సూర్నం రాంనర్సయ్య ఆధ్వర్యంలో గుంతలమయంగా ఉండి ఎంతో ప్రమాదకరంగా ఉన్న రోడ్డుపై మట్టి, సీసీ మెటీరియల్స్‌తో చేపట్టారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు దామెర సరేష్, ముడుపు రవీందర్‌రెడ్డి, వజినపల్లి శ్రీనివాస్, బోనగిరి శంకర్ పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు సన్మానం

కురవి: సీరోలు మండలం కాంపల్లి గ్రామంలో శుక్రవారం ప్రతిభావంతులకు గ్రామస్తులు ఘనంగా సన్మానం చేశారు. కాంపల్లి గ్రామానికి చెందిన మదిననాల లావణ్య ఇండియా తరపున ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైంది, అలాగే మేకల లిఖిత ఎంబీబీఎస్ సీటు సాధించింది, సీరోలు గ్రామానికి చెందిన పోగుల వినయ్‌కి ఎంపీఓ ఉద్యోగం రావడంతో వీరి ముగ్గురిని గ్రామస్తులు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు.

బహుమతుల ప్రదానం

కురవి: సీరోలు మండలం కాంపల్లి గ్రామంలో దసరా వేడుకల సందర్భంగా గ్రామంలో కబడ్డీ పోటీలను నిర్వహించగా విజేతలకు శుక్రవారం బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి సాయిజశ్వంత్‌రెడ్డి, ద్వితీయ బహుమతి మడ్డి మహేష్, హత్తిరాం పలుకుబోడు తండాలు అందించగా స్పెషల్ రైడర్‌గా గోల్కొండ వంశీ, డిఫెండర్‌గా హత్తిరాం అందుకున్నారు. మొదటి బహుమతిగా పూలసాని శ్రీనివాస్‌రెడ్డి రూ.3016, ద్వితీయ బహుమతిగా రూ.2016, తృతీయ బహుమతి రూ.1516ల నగదుతోపాటు షీల్డ్‌లను అందజేశారు. క్రీడాకారులందరికి పొన్న మహేష్ అనే వ్యక్తి రూ.3016లు అందించారు.

విజయానికి ప్రతీక విజయదశమి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్

గూడూరు: చెడుపై మంచికి చిహ్నంగా జరుపుకునే దసరా వేడుకలు విజయానికి ప్రతీకగా నిలుస్తాయని ఎమ్మెల్యే మురళీనాయక్, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్‌నాయక్ అన్నారు. మండలకేంద్రంలోని రాంలీలా మైదానంలో గురువారం రాత్రి జరిగిన దసరా వేడుకలో వారు మాట్లాడారు. ప్రతీ ఒక్కరు సుఖసంతోషాలతో ఆనందంగా ఉండాలని, మంచి మనుసుతో చేసే పనులు విజయాలను ప్రసాదిస్తాయని, పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు పింగిళి శ్రీనివాస్, సనాతన శివాలయ చైర్మన్ ఏపూరు రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నూనావత్ రమేష్, వాంకుడోతు కొమ్మాలు, మాజీ ఎంపీటీసీ కత్తి స్వామి, ఉత్సవ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

డీజే అనుమతి నిరాకరణపై రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న నిర్వాహకులు, భక్తులు

మహబూబాబాద్ రూరల్: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు వేడుకల్లో భాగంగా జిల్లా కేంద్రంలో శుక్రవారం రాత్రి దుర్గామాత శోభాయాత్రలు, ఊరేగింపులను పురస్కరించుకుని భక్తులు ర్యాలీగా బయలుదేరారు. ఈక్రమంలో పోలీసులు మార్వాడీల శోభాయాత్ర వద్దకు చేరుకుని డీజేల నిర్వహణకు అనుమతిలేదని ఉత్సవ కమిటీల నిర్వాహకులు, భక్తులతో పేర్కొన్నారు. ఈ క్రమంలో హిందూ సంఘాల నాయకులు, భక్తులు, ఉత్సవ కమిటీల నిర్వాహకులు పోలీసుల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ స్థానిక ఇందిరాగాంధీ సెంటర్‌లో రాస్తారోకో చేపట్టారు. డీజేలకు అనుమతి నిరాకరణ పేరుతో పోలీసులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని, నిబంధనల పేరు చెప్పి అవాంతరాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. డీజేల వల్ల ఘర్షణలు, అల్లర్లు, ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ముందస్తుగా అనుమతి నిరాకరించామని పోలీసులు పేర్కొన్నారు. శాంతియుతంగా ఊరేగింపులు జరుపుకోవాలని పోలీసులు సూచించిన అనంతరం ఆందోళన విరమించారు.

లారీ బోల్తా.. తప్పిన ప్రమాదం

దంతాలపల్లి: మండలంలోని బాలాజీ కాటన్ మిల్లు వద్ద శనిగపిండితో వెళ్తున్న లారీ పల్టీ కొట్టిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. డ్రైవర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. గుజరాత్ రాష్ట్రం నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని భీమవరం చేపల మేతకు లారీలో శనిగపిండి బస్తాలు తరలిస్తున్నారు. ఈక్రమంలోనే ఉదయం ఐదుగంటల సమయంలో లారీ అదుపు తప్పి పల్టీ కొట్టింది. ఈ ఘటనలో ఎవరికి ప్రమాదం జరగలేదు.

కేవీపీఎస్ ఆవిర్భావ వేడుకలు

నెహ్రూసెంటర్: కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) 28వ ఆవిర్భావ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సంఘం జెండాను జిల్లా కార్యదర్శి దుడ్డెల రాంమూర్తి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దళిత, బడుగు, బలహీన, పీడిత వర్గాల ఐక్యత, సమస్యల పరిష్కారం కోసం కేవీపీఎస్ పోరాటాలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చీపిరి యాకయ్య, రాములు, యూసఫ్, మహేందర్, ప్రశాంత్, వెంకన్న, గణేష్, నాగరాజు, వెంకటాద్రి, కుమార్, నరేష్, లాలు పాల్గొన్నారు.

అమ్మవారి ముక్కుపుడక వేలం

మరిపెడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి నవరాత్రులు ముగింపు సందర్భంగా అమ్మవారి ముక్కు పుడకను వేలం వేయగా స్థానిక ముస్లిం షేక్ రహీముద్దీన్ రూ. 45,116లకు దక్కించుకున్నాడు. అమ్మవారి హుండీ రూ.32,116లకు రావుల శ్రీనివాస్‌రెడ్డి, సునీతలు దక్కించుకున్నారు. అమ్మవారి పట్టుచీర రూ.23,116లకు స్థానికుడు గంధసిరి సోమయ్య దక్కించుకున్నాడు. దీంతో అమ్మవారి ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానికులు వారిని అభినందించారు.

అమ్మవారి కలశం రూ.39వేలకు..

కురవి: మండలంలోని మోద్గులగూడెం గ్రామంలోని బొడ్రాయి సెంటర్ వద్ద దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారి కలశంను గ్రామానికి చెందిన సామల అశోక్–మాలతి దంపతులు వేలంలో దక్కించుకున్నారు. అలాగే అమ్మవారి చీరలను మరో ఇద్దరు భక్తులు దక్కించుకున్నారు.

పింఛన్ ఇప్పించండి సార్..


దివ్యాంగుడు జినక విజయ్

మహబూబాబాద్ అర్బన్: దివ్యాంగుడైన జినక విజయ్ పింఛన్ రావడంలేదని దయచేసి జిల్లా పాలనఅధికారులు స్పందించి విజయ్‌కి పింఛన్ ఇప్పించండి సార్ అని విజయ్ బాబాయి ఎల్లయ్య అధికారులను శుక్రవారం వేడుకున్నాడు. మానుకోట మున్సిపల్ పరిధిలోని బేతోలు ఆరువారులో దివ్యాంగుడు విజయ్‌కి పింఛన్ ఇవ్వాలని కోరారు. విజయ్ తల్లిదండ్రులను కోల్పోయి అనాథగా మారడని, పుట్టకతోనే దివ్యాంగుడని, మూడు నెలలుగా ప్రభుత్వం నుంచి ఆసరా పింఛన్ రావాడం లేదన్నారు. దీనిపై అధికారులకు వినతిపత్రం అందజేయగా ఆధార్‌కార్డు, సదరం సర్టిఫికెట్ లింక్ లేదని, అందుకే పింఛన్ రావడంలేదన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి

● మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్


డోర్నకల్: మాట్లాడుతున్న రెడ్యానాయక్

కురవి: త్వరలో జరిగే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలని మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ దిశానిర్దేశం చేశారు. శుక్రవారం మండలంలోని అయ్యగారిపల్లి గ్రామంలో బీఆర్ఎస్ కార్యకర్తలతో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోటలాలయ్య అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన గ్యారంటీల మోసాన్ని వివరించాలన్నారు. కార్యకర్తలు ఐకమత్యంతో ఉండి ఎంపీటీసీ, జెడ్పీటీసీలను కైవసం చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో పోటీచేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఊరు నుంచి ముగ్గురు ఆశావాహుల పేర్లను అందించాలని తెలిపారు. కార్యక్రమంలో బజ్జూరి పిచ్చిరెడ్డి, దొడ్డ గోవర్ధన్‌రెడ్డి, గుగులోత్ రవినాయక్, నూతక్కి నర్సింహారావు, బోజ్యానాయక్, మాలోత్ సూర్యనాయక్, గణేష్, నామా సైదులు పాల్గొన్నారు.

గెలుపే ధ్యేయంగా పనిచేయాలి

డోర్నకల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా కార్యకర్తలు పని చేయాలని మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ కోరారు. మండలంలోని గొల్లచర్ల గ్రామంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ భిక్షంరెడ్డి, కత్తెరసాల విద్యాసాగర్, బాలునాయక్ పాల్గొన్నారు.

జాతిపిత మహాత్మాగాంధీకి నివాళి


మహబూబాబాద్: గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు


మహబూబాబాద్ అర్బన్: గాంధీ చిత్రంపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు


మహబూబాబాద్ రూరల్: నివాళులర్పిస్తున్న పోలీసులు


గార్ల: నివాళులర్పిస్తున్న నాయకులు

జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటం, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ.. జాతిపిత మహాత్మాగాంధీ చూపిన సత్యం, ధర్మం, సహనం, అహింసా మార్గాలు ప్రతీ ఒక్కరు అనుసరించాలని సూచించారు. గాంధీజీ అహింసామార్గంతో దేశానికి స్వాతంత్య్రం సాధించారని, మహాత్ముడిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగినప్పుడే దేశం సర్వోన్నతి చెందుతుందన్నారు.

– సాక్షి నెట్‌వర్క్

దేవ పూజ.. అగ్నిహోత్రం

మహబూబాబాద్ రూరల్: దసరా పండుగను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ఆర్య సమాజ్ మందిరం ఆవరణలో లోక కల్యాణార్థం దేవ పూజ, అగ్నిహోత్రం పూజా కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఆర్యసమాజ్ అధ్యక్షుడు నారాయణ ప్రకాష్ లోయ ఆధ్వర్యంలో యజ్ఞబ్రహ్మగా డాక్టర్ సవిత ఆర్య దేవపూజ, అగ్నిహోత్రం పూజలు జరిపి ఓం పతాకావిష్కరణ చేసి, వేద మంత్రాల మధ్య భక్తులు యజ్ఞంలో విశేష ఆహుతులు సమర్పించారు.

ఘనంగా దుర్గాదేవి శోభాయాత్ర


కేసముద్రం: దుర్గామాతను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు


కురవిలో దుర్గాదేవి శోభాయాత్రలో భక్తులు


మహబూబాబాద్ రూరల్: మహేశ్వరి భవన్‌లో..


గార్ల: దుర్గాదేవిని ఊరేగిస్తున్న మాలధారులు


చిన్నగూడూరు: జయ్యారంలో..

దేవిశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భక్తుల పూజలందుకున్న దుర్గాదేవి శోభాయాత్ర శుక్రవారం కనులపండువగా శోభాయమానంగా జరిగింది. అమ్మవారిని ప్రత్యేక వాహనాల్లో అందంగా అలంకరించారు. డప్పుచప్పుళ్లు, మేళతాళాల నడుమ అమ్మవారిని ఊరేగించారు. అనంతరం గ్రామాల్లోని చెరువుల్లో నిమజ్జనం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్

జాతీయజెండా ఆవిష్కరణ


జెండాను ఆవిష్కరిస్తున్న కొమురయ్య

గార్ల: జాతీయతా భావాన్ని, దేశభక్తిని మననం చేసుకుంటూ, మతసామరస్యానికి ప్రతీకగా దసరా పండుగ రోజున గార్లలోని మసీదు సెంటర్‌లో స్వాతంత్య్ర సమరయోధుడు తోడేటి కొమురయ్య జాతీయ జెండాను ఆవిష్కరించారు. ప్రతీ ఏటా దసరా పండుగ రోజున గార్ల మసీదు సెంటర్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించడం ఆనవాయితీగా వస్తోంది. గార్లలో గత 74ఏళ్లుగా కొనసాగుతుంది. కార్యక్రమంలో అజ్మీర బన్సీలాల్, గంగావత్ లక్ష్మణ్‌నాయక్, వివిధ పార్టీల నాయకులు కందునూరి శ్రీనివాసరావు, తాళ్లపల్లి కృష్ణగౌడ్, హతీరాం, శ్రీనుగౌడ్, మురళీ పాల్గొన్నారు.